క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా నల్లగొండ పట్టణంలోని వివిధ కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ డి.శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీలైన్ పనులు జరుగుతున్నందున ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు ఆర్టీసీ కాలనీ, శ్రీనివాసకాలని, సతీష్‌నగర్, బస్టాండ్, బోయవాడ, పద్మావతికాలనీ, క్రాంతినగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

చిట్యాల: నార్కట్‌పల్లి సీఐగా కె.నాగరాజు చిట్యాలలోని సర్కిల్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నల్లగొండ డీఎస్‌బీ నుంచి బదిలీపై నార్కట్‌పల్లికి వచ్చారు. నార్కట్‌పల్లి సీఐగా పనిచేసిన టి.మహేష్‌ను ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు. సీఐ నాగరాజుకు చిట్యాల ఎస్ఐలు సైదాబాబు, నవీన్‌కుమార్ స్వాగతం పలికారు.

తిప్పర్తి తహసీల్దార్‌గా స్వప్న..



రామగిరి(నల్లగొండ): తిప్పర్తి తహసీల్దార్‌గా డొంకెన స్వప్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కట్టంగూరు నుంచి తిప్పర్తికి బదిలీపై వచ్చారు. కాగా తిప్పర్తిలో పనిచేస్తున్న పద్మ మాడ్గులపల్లికి బదిలీ అయ్యారు.

నకిరేకల్ తహసీల్దార్‌గా జహీరుద్దీన్



నకిరేకల్ : నకిరేకల్ తహసీల్దార్‌గా మహ్మద్ జహీరుద్దీన్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రసాద్ నాయక్ కట్టంగూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మాడుగులపల్లి తహసీల్దార్ మహ్మద్ జహీరుద్దీన్ నకిరేకల్‌కు వచ్చారు.

నాంపల్లి సీఐగా జలంధర్‌రెడ్డి



మర్రిగూడ: నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.జలంధర్‌రెడ్డి గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జలంధర్‌రెడ్డి అంతకుముందు హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో పనిచేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ ఎ.నవీన్ కుమార్ ఐజీ కార్యాలయానికి అటాచ్ అయ్యారు. ఈ సందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ అక్రమ మద్యం నివారణకు ప్రజలు సహకరించాలని, బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ కె.రంగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నల్లగొండ ఎక్సైజ్ సీఐగా బూర ప్రసాద్



నల్లగొండక్రైం: నల్లగొండ ఎక్సైజ్ సీఐగా బూర ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు.. దూల్‌పేట సీఐగా పని చేస్తున్న ఆయనను ప్రభుత్వం నల్లగొండకు బదిలీ చేసింది. కాగా నల్లగొండలో సీఐగా పని చేసిన వెంకటేశ్వర్‌రెడ్డిని మహబూబ్ నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి బదిలీ చేశారు.

కనగల్ ఎంపీఓగా కే.సుమలత

కనగల్: ఎంపీఓగా కే.సుమలత గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాలుగేళ్లపాటు కనగల్‌లో పనిచేసిన మహ్మద్ ముజీబుద్దీన్ నల్లగొండ రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. మునుగోడు మండలంలో పనిచేస్తున్న సుమలత ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

కనగల్ ఎంపీడీఓగా తులసీ జయరాం

కనగల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న చిలకమర్రి తులసీ జయరాం శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నాలుగేళ్లపాటు పనిచేసిన దేవిరెడ్డి సోమసుందర్‌రెడ్డి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలానికి బదిలీపై వెళ్లారు.

కనగల్ తహసీల్దార్‌గా పద్మ

కనగల్ మండల తహసీల్దార్‌గా శుక్రవారం పద్మ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమె నార్కట్‌పల్లి మండలంలో పనిచేస్తూ కనగల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ జ్యోతి మిర్యాలగూడెం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా బదిలీపై వెళ్లారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

నకిరేకల్ : మండలంలోని నెల్లిబండ గ్రామంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు బొడ్రాయి, కోట మైసమ్మ, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు. 16న గోపూజ, గ్రామ ప్రదక్షిణ, మహాగణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.18న బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు జరగనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు స్నాక్స్ అందజేత

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని పాతబస్తీ జేబీఎస్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఎస్‌పీటీ ప్లాటినం సభ్యుడు, లయన్ జెల్లా దశరథ-అండాలు వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం రూ.10 వేల విలువ గల స్నాక్స్ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌రెడ్డి, జెల్లా దశరథ, పుట్ట వెంకన్న, దాసోజు శ్రీనివాసచారి, మాదగోని స్వామి, శ్రవణ్‌కుమార్, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, గిరిబాబు, ప్రతిమ, రత్నమాల, వెంకట్రావు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి ధర్మభిక్షం



నల్లగొండటౌన్: ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు



నల్లగొండటౌన్: పూలమాల వేస్తున్న గౌడ సంఘం నాయకులు



నల్లగొండ రూరల్: పూలమాల వేస్తున్న గౌడ ఉద్యోగ సంఘం నాయకులు

నల్లగొండ రూరల్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి ధర్మభిక్షం అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. గురువారం ధర్మభిక్షం 102వ జయంతి సందర్భంగా స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి జనార్దన్‌గౌడ్ పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ రేఖల భద్రాద్రి, చంద్రశేఖర్‌గౌడ్, నరేష్‌గౌడ్, చింతల యాదగిరిగౌడ్, రామన్నగౌడ్, పుల్లెంల యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నరేష్‌యాదవ్, విజయ్‌కుమార్‌గౌడ్, జెరిపోతుల లింగయ్యగౌడ్ పాల్గొన్నారు.

ధర్మభిక్షం సేవలు మరువలేనివి

మాజీ ఎంపీ ధర్మభిక్షం సేవలు మరువలేనివని గౌడ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని రాంబాబుగౌడ్ అన్నారు. ధర్మభిక్షం 102వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక గౌడ హాస్టల్‌లో రాంబాబుగౌడ్ పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. ఉద్యోగ సంఘం నాయకులు మర్రి శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, కారింగ్ కృష్ణయ్యగౌడ్, గుండగోని రవిశంకర్‌గౌడ్, వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, సమ్మెటి తిరుమలేష్‌గౌడ్, గుణగంటి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండటౌన్: సూర్యాపేట జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నకిరెకంటి కాశయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మభిక్షం 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం స్థానిక గౌడ సంఘం కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాశయ్యగౌడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎరుకల శంకర్‌గౌడ్, నాయకుడు చెరుకు మల్లికార్జున్‌గౌడ్, పుల్లెంల యాదగిరిగౌడ్, జెర్రిపోతుల శంకర్‌గౌడ్, సత్యనారాయణ, రాజాగౌడ్, కృష్ణాగౌడ్, నకిరెకంటి లాలయ్యగౌడ్, దశరథగౌడ్ పాల్గొన్నారు.



మునుగోడు: పూలమాల వేస్తున్న నాయకులు

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి, ఎస్‌కె. మదార్, వడిగ సైదులు, ఎండీ. యూసుఫ్, విశ్వనాథుల లెనిన్, ఉంగరాల శంకర్, తాల్ల యాదగిరి, కౌసల్యనాయక్, శారద, ముత్తమ్మ, భవాని, అంజి పాల్గొన్నారు.



మర్రిగూడ మండల కేంద్రంలో..

మర్రిగూడ: మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 102వ జయంతిని మర్రిగూడ మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ధర్మభిక్షం విగ్రహానికి సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, చల్లం పాండురంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల రఘుమయ్య, గీతపనివారల సంఘం నాయకులు ఎరుకల యాదయ్య, కర్నాటి శేఖర్, మాదగోని నరసింహ, కర్నాటి అంజయ్య, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: ధర్మభిక్షం జయంతి సందర్భంగా మునుగోడులోని ఆయన విగ్రహానికి గురువారం సీపీఐ, గౌడ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, బి.లాలు, ఈదులకంటి కైలాస్‌గౌడ్, జి.లింగయ్య, దుబ్బ వెంకన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌కు వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఈఓ మోహన్‌బాబు

నార్కట్‌పల్లి: వలిగొండ మండలంలోని వెంకటపురం గ్రామంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు గురువారం నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్, నల్లగొండ, యాదగిరిగుట్ట, ప్రాంతాల నుంచి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది రాగీరు పాండు ఉన్నారు.

రెవెన్యూ మంత్రికి..

నకిరేకల్ : ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన నిధులకు అక్రమ బిల్లులు పెట్టిన నల్లగొండ జిల్లాలోని 20 మండలాల తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నకిరేకల్‌కు చెందిన సమాచార హక్కు చట్టం ప్రతినిధి ఉబ్బని రాజు వినతి పత్రం అందజేశారు. సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికల ఆత్మరక్షణకు కరాటే దోహదం

చండూరు: ప్రతిరోజు దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో బాలికలపై, ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, బాలికలకు చదువు ఒకటే సరిపోదని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని ఎస్ఐ ఉప్పు సురేష్ అన్నారు. ఈ నెల 11న జిల్లా కేంద్రంలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి షోటోకాన్ కరాటే టోర్నమెంట్‌లో స్థానిక గాంధీజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి, మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా గాంధీజీ స్కూల్లో ఏర్పాటుచేసిన అభినందన సభలో విద్యార్థులకు ఎస్ఐ మెడల్స్, సర్టిఫికెట్స్ అందించి అభినందించారు. మెడల్స్ తీసుకున్న వారిలో ఐశ్వర్య, అన్నవరం, చక్రధర్, అనన్య, జ్ఞానేష్, శ్రీనిధి, విష్ణు, జోహాఫ్సీన్, మెహర్, మదిహ, తరుణి, సాయి శ్రీ, సహస్రలు ఉన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, డైరెక్టర్ సరికొండ వెంకన్న, కరాటే ట్రైనర్ శ్రీధర్ సాగర్, ప్రిన్సిపాల్ చెరుపల్లి రామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ సురేష్

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్డీఓ రవి అధికారులకు సూచించారు. చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆయన ఆలయానికి వచ్చారు. వివిధ శాఖల అధికారులతో కలిసి గట్టుపైన కల్యాణమండపం, కోనేరు, టాయిలెట్లు, తాగునీరు అందించే ప్రాంతాలను పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా అవసరమైన మేరకు తాగునీరు సౌకర్యం బల్క్ వాటర్ సరఫరా చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తగినంత సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేయాలన్నారు. ఆయన వెంట ఆలయ అధికారి నవీన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రదీప్‌కుమార్ , ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్‌కుమార్, ఆర్ఐ తరుణ్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం

రామగిరి (నల్లగొండ): చర్లపల్లిలో గల శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందమాంబ కల్యాణం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మంగారి తరపున చౌడోజు అంజయ్య చారి-గ్రామిక దంపతులు, గోవిందమాంబ తరపున మేడారం యాదగిరిచారి-గిరిజ దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, నవీన్, విజయ్, సైదులు, శ్రీధర్, సందీప్, వెంకన్న, రాజు, బ్రహ్మచారి శ్రీనివాస్, అర్చకులు సంతోష్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

రామగిరి(నల్లగొండ): ప్రేమించి వివాహం చేసుకున్న ఓ జంట గురువారం తిప్పర్తి పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. తానేదార్‌పల్లికి చెందిన యువకుడు మల్లేపల్లి కార్తీక్, కంకణాలపల్లికి చెందిన వల్లందాసు లావణ్య వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఇద్దరు ఒకరికొకరు ఇష్టపడి గురువారం ఉదయం చెర్వుగట్టు ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. కులాంతర వివాహం అయినందున యువతి తల్లిదండ్రులు పెళ్లికి నిరాకరించారు. పెద్దలు అంగీకరించకపోవడంతో ఆ జంట పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ డి.రాజు ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు. ఇద్దరు మేజర్లు కావడంతో చట్టరీత్యా వారిపై ఎలాంటి ఒత్తిడి చేయొద్దని కుటుంబ సభ్యులకు సూచించారు. వారికి ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇద్దరి కుటుంబ సభ్యులపై ఉందని వారికి తెలిపారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ డి.రాజు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నల్లగొండ క్రైం: నకిరేకల్-పానగల్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నడుపుతున్న తోకల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న డీసీఎం.. ఎదురుగా వస్తున్న కారును చందనపల్లి సమీపంలో ఢీకొనడంతో కారు నడుపుతున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్ సోదరుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన టీఎన్‌జీఓ నేతలు

నల్లగొండటౌన్: నూతనంగా ఎన్నికైన టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని టీఎన్‌జీఓ ప్రతినిధులు సన్మానించారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి మంత్రి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిల్ల మురళి, కార్యదర్శి జె.శేఖర్‌రెడ్డి, కోశాధికారి మేడి జయరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, మాజీ జిల్లా అధ్యక్షుడు ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, సహాధ్యక్షుడు డి.ఐరాజు, ఉపాధ్యక్షులు కొంగల దశరథ, సహాయ కార్యదర్శి కత్తుల మనోజ్, కోఆపరేటివ్ డిపార్ట్‌మెంటు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగూరు విజయకృష్ణ, కార్యదర్శి అలీం తదితరులు పాల్గొన్నారు.



బొకే అందజేస్తున్న టీఎన్‌జీఓ ప్రతినిధులు

రవిచంద్రకు శుభాకాంక్షలు



రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

నల్లగొండటౌన్: రాజ్యసభకు నామినేటెడ్ అయిన వద్దిరాజు రవిచంద్రను గురువారం మున్నూరుకాపు సంఘం నాయకులు హైదరాబాద్‌లో కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవుల వెంకట నరసయ్య, ఇంద్రయ్య, చంద్రయ్య, విజయభాస్కర్, శ్యాంసుందర్‌రావు, వీరమల్ల భాస్కర్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కేతేపల్లి: మండల కేంద్రంలోని జపమాల మందిర పునరుద్ధరణ, క్రైస్తవ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని చర్చి పునరుద్ధరణ కమిటీ సభ్యులు బందా లూబెత్, అవ్వారి రాయప్ప ఆరోపించారు. గురువారం క్రైస్తవ ప్రతినిధులతో కలిసి కుంగిన శ్మశాన వాటిక ప్రహరీని వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆలయ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం రూ.30 లక్షలు, శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. గోడ నిర్మాణంలో కాంట్రాక్టర్ నాసిరకం సిమెంటు, ఇసుక వాడడంతో మూడు నెలలకే ప్రహరీ కుంగిపోయిందన్నారు. చర్చి పునరుద్ధరణ పనులు కూడా నాసిరకంగా చేపడుతున్నారని అన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

నల్లగొండటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శుక్రవారం తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల కన్వీనర్ దండెంపల్లి సరోజ పిలుపునిచ్చారు. బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కతాల్‌గూడెంలో ఇంటింటికీ కరపత్రాలను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ఆమె వెంట కట్టా అంజయ్య, గోలి నర్సింహ, శ్రీను, ధనమ్మ, కవిత, యాదమ్మ, బాలమ్మ, బక్కమ్మ, పిచ్చమ్మ, సునిత, కోటమ్మ, రేణమ్మ ఉన్నారు.

సమ్మెకు మద్దతు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం తలపెట్టిన బంద్‌కు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తోందని డీవైఎఫ్ఐ నాయకుడు గుండాల నరేష్ తెలిపారు. గురువారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట శ్రీనివాసచారి, కార్తిక్, రాము, మహేష్, నరేష్ ఉన్నారు.



నల్లగొండటౌన్ : కరపత్రాలు పంపిణీ చేస్తున్న దండెంపల్లి సరోజ

చండూరు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న పిలుపునిచ్చారు. ఆయన గురువారం చండూరులో విలేకరులతో మాట్లాడారు. జెల్లా శ్రీను, యాదయ్య, భూతరాజు శ్రీను, సైదులు, దోమలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



మర్రిగూడ : సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్ : పండ్లు పంపిణీ చేస్తున్న కట్టెల శివకుమార్

నల్లగొండ టూటౌన్: శ్రీసంత్‌సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చునాయక్, కోనేటి నరసింహ, కొండేటి నరసింహ, నరేష్‌కుమార్, చిత్రం శ్రీను, అలంపల్లి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్ మండలంలో..

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండలం అంతపేట గ్రామంలో గిరిజనుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి లంబాడిలా ఐక్య వేదిక, బీఎస్ఎన్ ఫౌండేషన్ చైర్మన్ సుధాకర్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాటవత్ కుమార్‌నాయక్, నేనావత్ చరణ్, గణేశ్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేవలు మరువలేనివి

మర్రిగూడ: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సేవలు మరువలేనివని జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఖుదాబాక్షపల్లి గ్రామ పరిధి గల సాయిబండాతండాలో సేవాలాల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ సేవాలాల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంబోతు సుధాకర్‌నాయక్, లక్ష్మణ్, పాండు, పెంటియ, లక్ష్మణ్‌నాయక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కేతేపల్లి: మండలంలోని కొప్పోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్థానిక ఆలయాల ప్రధాన అర్చకుల బృందం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. గణపతి పూజ, మంటపారాధన పుణ్యవచనం, కంకణధారణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుపతమ్మ మాలధారణ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, ఆలయ స్థల, నిర్మాణ దాతలు అలుగుబెల్లి సత్తమ్మ, గోపిరెడ్డి వీరారెడ్డి, గురుస్వాములు వెంకన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ: మండలంలోని మేటిచందాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందుర్తి గ్రామానికి చెందిన మహమ్మద్ ఫరీనాబేగం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ గురువారం ఫరీనాబేం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

మర్రిగూడ: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ కుటుంబానికి వారి స్నేహితులు సామాజిక కార్యకర్త కొడాల అల్వాల్‌రెడ్డి, పందుల రమేష్, గడ్డి లింగయ్య గురువారం రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట వడ్డెమాన్ సైదులు, సుంకరి మల్లేష్, పగడాల నగేష్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

శాలిగౌరారం: శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని పావురాలగూడెంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గురువారం దేవాలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ఆలయ ప్రాంగణంలోని బీరువా, హుండీ ధ్వంసమై ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు వెంటనే దేవాలయం వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్ దేవాలయానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. దొంగలు హుండీ తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.15 వేలతో పాటు పక్కనే బీరువాలో ఉన్న రూ.10 వేల నగదు, మైక్‌సెట్ యాంప్లిఫయర్, ఇతర సామగ్రి, రెండు పెద్ద కంచు గంటలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.50 వేలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు గోదల వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముత్తమ్మకు నివాళి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటి అధ్యక్షుడు జడల చినమల్లయ్య తల్లి ముత్తమ్మ(80) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. గురువారం చిట్యాలలో ఆమె మృతదేహాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, దైద రవీందర్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు.

స్వపరిపాలన దినోత్సవం



వట్టిమర్తిలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా విధులు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ సాగర్ల నరేష్, ఎస్ఎంసీ చైర్మన్ వీరస్వామి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానకి, అనిత, పద్మావతి, భారతి, విమల, సంతోష తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

కట్టంగూర్ : తాటి చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని అంబటివాగు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గౌడ సంఘం అధ్యక్షుడు కొంపెల్లి యాదయ్య, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు వద్ది మల్లేష్ రోజువారి మాదిరిగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రోత్సాహకం అందజేత

రామగిరి(నల్లగొండ): గత సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్స్‌గా నిలిచిన తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు విద్యార్థులకు క్యూబ్ రూట్ ఫౌండేషన్ సభ్యులు ప్రోత్సాహకం అందజేశారు. గురువారం పాఠశాలను సందర్శించి మండల ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ అనూజ్ మైత్రి, ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి, ఉపాధ్యాయులు టి.జగదీష్, ఫసి అహ్మద్, తేజవర్మ, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.